ఆర్ఐ వెంకటగిరికి సన్మానం

కులకచర్ల, జనవరి 27 : చౌడాపూర్ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ భూముల సమస్యలను పరిష్కరిస్తున్న చౌడాపూర్ ఆర్ఐ వెంకటగిరికి రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా అవార్డు రావడంతో శనివారం చౌడాపూర్ మండల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ ప్రభు, వెంకటగిరి సేవలు ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎ.అశోక్‌కుమార్, ఎండీ సలీమ్, వినయ్, రాము, వెంకటేశ్, రెవెన్యూ అధికారులు లింగయ్య, జగన్, యాదయ్య, ప్రభు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజాప్రతినిధులకు సన్మానం

షాద్‌నగర్ రూరల్, జనవరి 27 : ఫరూక్‌నగర్ మండలంలోని కమ్మదన గ్రామ ప్రజాప్రతినిధులను శనివారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం ముగియనుండడంతో శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గత ఐదేండ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామస్తుల సమస్యలను పరిష్కరించినందుకు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కొడంగల్, జనవరి 27: ఆపదలో ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహద పడుతుందని సీఐ రాములు, ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో తైక్వాండో కరాటే పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఐ, ఎస్‌ఐ సర్టిఫికెట్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే విద్య ఆత్మరక్షణకే కాకుండా శరీర దృఢత్వానికి, ఏకాగ్రతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నేటి యువత అక్రమ మార్గాలను ఎంచుకొని మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను అంధకారం చేసుకొంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలు కరాటే విద్య నేర్చుకోవాలని, అప్పుడే ఆత్మస్థైర్యం పెరిగి అన్నింటా రాణించే ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా కరాటే విద్యలో శిక్షణ అందిస్తున్నందుకు గాను తైక్వాండో మాస్టర్ సురేశ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కరాటే నాంచాక్ కోచ్ మాస్టర్ మనోహర్, వార్డెన్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలని వినతి

ఆమనగల్లు, జనవరి 27 : శంకర్‌కొండ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని దయ్యాలబోడు తండాకు కత్వవాగు నుంచి బీటీ రోడ్డు నిర్మించాలని శనివారం వార్డు సభ్యుడు రాజు నాయక్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బీటీ రోడ్డు లేక గిరిజన ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో విజయ్ రాథోడ్, రాజేష్, జైపాల్, వినోద్, రాజు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ, జనవరి 27 : కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన బుసని బాల్‌రాజ్ ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఆయనకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుంచి మం జూరైన రూ.రెండు లక్షల విలువైన చెక్కును శనివారం దోమ జడ్పీటీసీ నాగిరెడ్డితో కలిసి పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మృతుడి భార్య సవర్ణకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ విజయాఆంజనేయులు, పార్టీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ లక్ష్మయ్యముదిరాజ్, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు రుక్మయ్యగౌడ్, శ్రీకాంత్‌రావు, భీమయ్య, బాలయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, అంజిలయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి మృతి తీరనిలోటు

కులకచర్ల : కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం బండవెల్కిచర్ల గ్రామంలో బాధిత కుటుంబసభ్యులను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని అన్నారు. అనంతరం మృతుడి భార్య శిరీషాలక్ష్మారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ కులకచర్ల మండల నాయకులు పీరంపల్లి రాజు, దోమ జడ్పీటీసీ నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మయ్య ఉన్నారు.

నేడు ఉచిత మెగావైద్యశిబిరం

కులకచర్ల, జనవరి 27 : పరిగి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి నివాసంలో టీఆర్ఆర్ ఆధ్వర్యంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు. పరిగిలోని టీఆర్ఆర్ స్వగృహంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

నాలుగేండ్ల వేడుక

మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు శనివారం పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. నాలుగేండ్ల ప్రగతిపై ఆలోచనలు పంచుకున్నారు.

- పెద్దఅంబర్‌పేట, జనవరి 27

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి, జనవరి 27: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో శనివారం టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంతేవో అక్బర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీ ఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధు సూదన్‌రెడ్డి రఘునందన్‌రెడ్డి, సుదర్శన్, మునీర్ పాషా, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న కొడంగల్ సీఐ రాములు

కొడంగల్, జనవరి 27 : రూ. 40 వేల విలువైన రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు కొడంగల్ సీఐ రాములు తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రావులపల్లి గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానంగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వారిని ఆపి సోదా చేయగా రూ. 40 వేల విలువైన రెండు కిలోల గంజాయి దొరికిందన్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా గత ఆరు నెలలుగా కర్ణాటక నుంచి కొడంగల్ పట్టణ ప్రాంతంలో రూ. 20 వేలకు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణంలో సోదాలు నిర్వహించి గంజాయి విక్రయాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శివరాములుగౌడ్, నరేందర్‌రెడ్డి, కృష్ణ, బాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దుతా

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జనవరి 27 : మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులను స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దుతానని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 13, 14, 22, 23 వార్డుల్లో పర్యటించి.. అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. గుర్తించిన సమస్యలను నోట్ చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమం లో వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, కౌన్సిలర్లు పావనీశేఖర్‌రెడ్డి, కిరణ్‌పటేల్, రామస్వామి, సురేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఖలేద్, ఆనంద్, రాములు, సిద్ధిక్, దీపు, సందీప్, జగన్, ఏఈ రాయుడు, డీఈ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు

పరిగి, జనవరి 27 : బీఆర్ఎస్ పార్టీ పరిగి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈనెల 29వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పరిగిలోని ఎస్ గార్డెన్‌లో జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ గ్రామ, మండల కమిటీల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు సమావేశానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఉత్తమ జేఎల్ ఎంగా కిషన్‌నాయక్

ప్రశంసాపత్రం అందుకుంటున్న కిషన్ నాయక్

బొంరాస్‌పేట, జనవరి 27 : మండలంలోని బొట్లవానితండాకు చెందిన జేఎల్ఎం కిషన్‌నాయక్ ఉత్తమ జేఎల్ఎంగా ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు కిషన్‌నాయక్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. దుద్యాల మండలంలో పనిచేస్తున్న కిషన్ నాయక్‌ను తోటి ఉద్యోగులు, గ్రామస్తులు అభినందించారు.

వరిసాగులో జాగ్రత్తలే మేలు

- తెగుళ్లు సోకుతుండడంతో ఎండిపోతున్న పంటలు
- నివారణకు సస్యరక్షణ
- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వ్యవసాయ అధికారుల సూచనలు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 27 : రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులు వరిపంటను అధికంగా సాగుచేశారు. తెగుళ్లు కూడా అధికంగా సోకే అవకాశముందున్నందున సరైన జాగ్రత్తలు పాటించాలని ఇబ్రహీంపట్నం ఏడీఏ సత్యనారాయణ రైతులకు సూచించారు. యాసంగి వరిపంటపై తెగుళ్ల బెడద తీవ్రమైంది. సాగునీరు అధికంగా విడుదల అవుతుండడం, బోర్లు, బావుల ఆధారంగా చాలామంది రైతులు వరిపైరును సాగుచేశారు. పైరులో మొదటి నుంచే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లేదంటే పైర్లు చీడపీడల ప్రభావానికి గురైతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సాగు నాటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచనలిస్తున్నారు. ముఖ్యంగా వరిపైరును సుడిదోమ, మొగిపురుగు, పాముపొడ, తెగుళ్లు నల్లకంకి తెగులు పైరును ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ సమయంలో రైతులు సమగ్రమైన వ్యవసాయాధికారుల సూచనల మేరకు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే, తెగుళ్లను సకాలంలో నివారించి మంచి దిగుబడిని సాధించుకోవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. గత రెండేండ్లతో పోలిస్తే ఈ ఏడాది పిలకదశలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండగా, నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

నారుదశ నుంచే ఆశించే మొగిపురుగు..

మొగిపురుగు వరి పైరుకు నారుమడి దశ నుంచి పైరు పూర్తిగా గింజపోసుకునే దశ వరకు ఆశిస్తుంది. తల్లి పురుగు ముదురు రంగులో ఉండి. ముందు రెక్కలపై నల్లటి మచ్చలను కలిగి ఉంటుంది. ఈ పురుగులు గోధుమరంగు వెంట్రుకలతో కప్పిన గుడ్లను గుంపులుగా నారుమళ్లలో పెడతాయి. నాటిన పొలంలో అయితే మొక్కలు ఆకుల చివరి భాగాల్లో పెడతాయి. మొక్క పిలకలు తొడిగే దశలో ఈ పురుగు ఆశిస్తే పైరు మొవ్వలు ఎండిపోయి చనిపోతాయి. పురుగు ఆశించిన మొక్కల మొవ్వలు, కంకులును లాగితే అవి తేలికగా బయటకొస్తాయి.

నివారణ చర్యలు..

- పురుగు ఉధృతిని గమనించడానికి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలి.
- పిలక దశలో ఎకరాకు 3 లింగాకర్షక బుట్టలు పెట్టి, అందులో వారానికి బుట్టకు 25-30పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- ప్రధానంగా పొలంలో గుళికల మందులు వాడితే ఖర్చు ఎక్కువవుతుంది. ఈ క్రమంలో వారంరోజుల ముందు ఎకరాకు సరిపడే నారుమడికి 800గ్రాములు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా, 600గ్రాముల ఫిప్రోనిల్ 0.3జి గుళికలు వేయాలి.
- ఒకవేల నారుమడిలో వేయకపోతే 15రోజుల వయస్సున్న పిలకదశలో ఉన్న వరిపైరులో ఈ యాసంగిలో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10కిలోలు లేదా, కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8కిలోలు లేదా, క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ 4 కిలోలు వేయాలి.
- కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే లార్వా దశలో వరిపైరును నష్టపరుస్తున్నట్లు తెలిసింది. అలాంటి ప్రాంతాల్లో క్వినాల్‌ఫాస్ 2మి.లీ, ప్రొఫెనోఫాస్ 2మి.లీ, లేదా కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2గ్రా,లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- పై పద్ధతులు రైతులు పాటిస్తే కాండం తొలుచు పురుగును నివారించుకోవచ్చని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

రసాన్ని పీల్చే సుడిదోమ..

పైరుకు అధికంగా నత్రజనిని అందించడం వలన సుడిదోమ పైరులో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. గోధుమ వర్ణం కలిగిన ఈ సుడిదోమలు వరి దుబ్బుల మొదళ్ల వద్ద నీటిమట్టంపై గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తుంటాయి. దీంతో పంట సుడులు, సుడులుగా ఎండిపోతుంది. అలాంటప్పుడు సుడిదోమను వెంటనే నివారించకపోతే పంటంతా కూడా దీని బారిన పడి పూర్తిగా ఎండిపోయే ప్రమాదముంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- రైతులు ప్రతినిత్యం వరిదుబ్బులు మొదళ్లను గమనిస్తూ ఉండాలి.
- వరిదుబ్బుకు 20కి మించి సుడిదోమలు కనిపిస్తే ప్రతి 2మీటర్లకు 30సెంటీమీటర్ల వెడల్పులో పాయలు తీసిగాలి వెలుతురు దుబ్బులకు తగిలే విధంగా చూడాలి.
- పొలంలో వెంటనే నీటిని తీసి ఆరుతడి పద్ధతిలో పైరుకు నీటిని అందించాలి.
- నత్రజని అధిక మొత్తంలో వాడకుండా తగిన మోతాదులోనే వేసుకోవాలి.
- వరిదుబ్బుకు 20 నుంచి 25వరకు దోమలు ఆశించి ఉంటే ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ 40మిల్లీలీటర్లు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- 50నుంచి 100వరకు దోమలు ఆశించి ఉంటే ఎకరాకు ఒక లీటరు నీటికి 1.5గ్రాములు ఎసిఫెట్ కలిపి మొదళ్ల దగ్గర పడేలా పిచికారీ చేయాలి.
- చిరుపొట్టదశకు దాని వరి పైర్లలో సుడిదోమను గమనిస్తే ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లుకోవాలి.
- వరిదుబ్బులకు 100నుంచి 200వరకు సుడిదోమలు ఆశించినట్లయితే ఒక లీటరు నీటికి ఎసిఫెట్ 2 గ్రాములు, డైక్లోరోపాస్ ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- దోమ ఉధృతి తీవ్రంగా ఉంటే బుప్రోజిన్ ఒక లీటరు నీటికి 1.5మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

గడ్డిద్వారా వ్యాపించే పాముపొడ..

పాముపొడ తెగులు సోకిన వరిమొక్కలపై పొడలు, పొడలుగా మచ్చలు ఏర్పడతాయి. గట్లపై ఉండే గడ్డివలన ఈ తెగులు వరిపంటకు వ్యాపిస్తుంది. నత్రజనిని అధిక మోతాదులో వాడటం వలన కూడా ఈ తెగులు వరిపంటలో వ్యాప్తి చెందుతుంది.

నివారణ చర్యలు..

- ముందుగా పొలంలో గట్లపై ఉన్న గడ్డిని కోసి వేసి గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి.
- తెగులు ఉధృతిని బట్టి ఒక లీటరు నీటికి ప్రోపికోనజోల్1మిల్లీలీటరు లేదా హెక్సాకోనజోల్ లేదా వాలిడా మైసిస్2మిల్లీలీటర్ల చొప్పున పైరంతా బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- వరిపైరు గింజ పోసుకునే దశలో తెగులు ఉధృతి పెరిగితే గింజలు పాలుపోసుకోకుండా నల్లగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టి తక్షణమే తెగులును నివారించే చర్యలు చేపట్టాలి.

నల్లకంకి తెగుళ్లతో పంటకు అధిక నష్టం..

వరిపంటకు నల్లకంకి తెగులు సోకితే 30శాతం వరకు పంటదిగుబడిని నష్టపోవాల్సి వస్తుంది. అందేకాకుండా గింజ నాణ్యత కూడా బాగా తగ్గిపోతుంది. ఈ తెగులు కంకి నల్లి అనే పురుగు నుంచి వస్తుంది. ఇవి ఆకు మట్టలలోను, ఆకు మధ్య ఈనెలలోనూ గుంపులుగా నివసిస్తాయి. ఇవిచాలా సూక్ష్మంగా ఉంటాయి. రైతులు వీటిని వెంటనే అంత సులభంగా గుర్తించలేరు. సూక్ష్మదర్శిని ద్వారా మాత్రమే కంకినల్లులను స్పష్టంగా చూడగలం. ఇవి పంట పిలక దశలో ఆకు ఈనెలలో, మట్టలలో వృద్ధి చెందుతాయి. ఈ కంకినల్లి పంట పూతదశలో, పంట గింజ పాలుపోసుకునే దశలో గింజలను ఆశించి పంటను బాగా నష్టపరుస్తాయి. పంటను కంకినల్లి ఆశించినప్పుడు తొలి దశలోనే ఆకుల మధ్య ఈనెలపై, ఆకుల మట్టలపై, కాండం మీద ముదురు గోధుమనుంచి నల్లటి మచ్చలు ఏర్పడతాయి.

నివారణ చర్యలు..

- పంటను కంకినల్లి ఆశించకుండా ఉండాలంటే కలుపు మొక్కలు పొలంలోనూ, గట్లమీద లేకుండా చూసుకోవాలి.
- నత్రజని ఎరువులను తగిన మోతాదులో దఫాలు, దఫాలుగా వేసుకోవాలి. కంకినల్లిని కంటితో గమనించలేం. కాబట్టి ఆకుల మధ్య ఈనెల, ఆకు మట్టలపై, కాండంపై గోధుమ నలుపురంగు మచ్చలు గమనించినప్పుడే కంకినల్లి ఆశించినట్లుగా గుర్తింపు నివారణ చర్యలు చేపట్టాలి.
- పొలంలో కంకినల్లి ఆశించిన లక్షణాలు కనిపించగానే డైకోఫాల్ 5మిల్లీలీటర్లు, ప్రొపినోఫాస్ 2మిల్లీలీటర్లను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- 15రోజుల వ్యవధిలో రెండుసార్లు మందును మార్చి పిచికారీ చేయాలి.
- కంకినల్లి బాగా ఆశించే ప్రాంతాల్లో పంటను కోసిన తరువాత వరి మొదళ్లు లేకుండా సమూలంగా నాశనం చేయాలి.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

వరిపంటను ఆశించిన తెగుళ్లు, పురుగులను రైతులు మొదట్లోనే గుర్తించాలి. ఇప్పటికే పంటల వివిధ రకాల కూరగాయల పంటలతో పాటు ముఖ్యంగా వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించాం. వరిపంటకు ఎలాంటి తెగుళ్లు సోకినా రైతులు నేరుగా డీలర్లను ఆశ్రయించకుండా వ్యవసాయాధికారులను ఆశ్రయించాలని, అనంతరం అధికారులు పంటలకు సోకిన తెగుళ్లను పరిశీలించిన తరువాత వారికి సూచనల మేరకు మందులను వేసుకుని పంటలను సాగుచేసుకోవాలి. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ మండల అధికారులు, ఏఈవోలను రైతులకు అందుబాటులో ఉంచాం. రైతులు వారి సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

- సత్యనారాయణ, ఏడీఏ ఇబ్రహీంపట్నం

విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఏసీపీ రాంచందర్‌రావు, కళాశాల డైరెక్టర్ చక్రపాణి

శంషాబాద్ రూరల్, జనవరి 27 : విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కమ్యూనిటీ కనెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ రోమీనా తెలిపారు. నాలుగు నెలల నుంచి ఐఎంటీ కళాశాల చుట్టు పక్కల గ్రామాలైన శంకరాపూర్, చర్లగూడ, ఘాన్సిమియాగూడ తదితర గ్రామాలకు చెందిన 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఉచితంగా గణితం, కంప్యూటర్ బేసిక్‌లో నైపుణ్యం పెంచడం కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశామని తెలిపారు. చివరి రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హాజరైన శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతనం ఏసీపీ రాంచందర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇలాంటి స్కిల్స్ అందించిన ఐఎంటీ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. సమావేశంలో ఐఎంటీ కళాశాల డైరెక్టర్ చక్రపాణి, శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్, కళాశాల అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.

NT-319424-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హెచ్చరిక ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అనగా M/s. శ్రీ దుర్గ ఎస్టేట్స్, హైదరాబాద్ వారు భూమి యజమాని అనగా ఇ.నవీన్ కుమార్ మరియు ఇతరులతో రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, అన్నారం గ్రామం వద్దగల సర్వే నం. 51, 51/1, 51/2, 52/EE, 52/UU, 52, 51/2/AA & 52/EEలోని **ఎ. 5.00 గుంటల** విస్తీర్ణం కలిగిన భూమికి సంబంధించి దాని స్వాధీనంతోపాటు విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. నా క్లయింటు ఎల్బీనగర్ వద్ద గౌరవనీయ IV అదనపు జిల్లా జడ్జి, ఆర్.ఆర్.జిల్లా గారి సమక్షంలో O.S.No. 64 of 2024 దావా దాఖలు చేశారు మరియు అది పెండింగులో ఉన్నది. కావున పై సదరు భూమిపై ఏ విధమైన లావాదేవీలు చేయరాదని సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది. ఒకవేళ ఏవైనా లావాదేవీలు చేసిన యెడల అవి చెల్లనేరవు మరియు అందుకు నా క్లయింటు బాధ్యులు కాజాలరు మరియు కొనుగోలుదారులు ఆపై జరిగే వ్యయ పర్యవసానాలకు బాధ్యులగుదురు.

సం/- శ్రీ వెంకట రంగదాస్ కానూరి
న్యాయవాది
ఫ్లాట్ నం. 414, సావరిన్ షెల్టర్ అపార్ట్‌మెంట్స్, లక్డీకపూల్, హైదరాబాద్.
మొబైల్: 9849009345
హైదరాబాద్, తేది: 27-01-2024

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి : 91827 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962